# చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలిసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



# మాట్లాడే వెన్నెముక విశ్వనాథ

కవి సామ్రాట్, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ గారు మాట్లాడే వెన్నెముక- పాటపాడే సుషుమ్న. తాను సత్యం అని నమ్మినదాన్ని నిర్భయంగా, నిస్సంకోచంగా, సభావేదికల మీద, తన రచనల్లోనూ చాటిన ధైర్యశాలి విశ్వనాథ. అందుకే ఆయనను 'మాట్లాడే వెన్నెముక' అన్నారు. 'పాట పాడే సుషుమ్న' అంటే మనందరికీ తెలిసిన విషయమే! ఇడా, పింగళా నాడుల మధ్యగా ఉంటుంది ఈ సుషుమ్నా నాడి. దాని ద్వారానే మూలాధార చక్రం నుంచి కుండలినీ శక్తి, సహస్రార చక్రం చేరి బ్రహ్మానందానుభూతిని కలిగిస్తుంది. అందుకే విశ్వనాథ పాట పాడే సుషుమ్న అన్నారు. అంటే సాహితీ మధురిమలు గ్రోలే వారికి, విశ్వనాథ వారి కవిత్వం, అమృత పానం చేసినంత బ్రహ్మానందం కలిగిస్తుంది.

ప్రపంచ ప్రఖ్యాత నాటకకర్త షేక్స్పియర్ గొప్ప నాటకాలూ, కవితలూ రాశాడు. మహా కావ్య రచన చేయలేదు. మిల్టన్ మహాకావ్యం రచించినా నవల రాయలేదు. రవీంద్రనాథ్ ఠాగూర్ అనేక సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేశారు. ఒక్క మహా కావ్యం తప్ప. కానీ, విశ్వనాథ వారి సాహిత్యంలో, నవల, కథ, కవిత్వం, నాటకం, మహాకావ్యం, విమర్శ లాంటి సమగ్ర సాహిత్య ప్రక్రియలు అన్నీ ఉన్న బహు గొప్ప సాహిత్యం.

అన్ని ప్రక్రియలు అయిన తర్వాత రామాయణ కల్ప వృక్షం రాశారు. కొంతమంది 'ఇప్పటిదాకా చాలా మంది రామాయణం రాశారు కదా, మళ్లీ మీరెందుకు రాయడం' అని అడిగారుట. దానికి వారు...

**'మరల నిదేల రామాయణంబన్నచో**
**ఈ జగత్తు తినుచున్న అన్నమే తినుచున్నది.**
**చేయుచున్న సంసారమే చేయుచున్నది.**
**తనదైన బ్రతుకు రుచి తనదిగాన'** అని తాను రామాయణాన్ని తనదైన అనుభూతి కోసం రాశానని చెప్పుకున్నారు బహుముఖీన సాహితీ సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు.

'నన్నయ, తిక్కన, శ్రీనాథుడు, రాయలు, పెద్దన, తెనాలి రామకృష్ణుడూ మొదలైన ఆరుగురు కవులు 19వ శతాబ్దిలో విశ్వనాథగా అవతరించారు' అని మరో జ్ఞానపీఠ పురస్కార గ్రహీత ఆచార్య సి.నారాయణరెడ్డి అన్నారు. తాత్త్విక, ధార్మిక, ఆధ్యాత్మికాది విషయాలు తన రచనల్లో ప్రతిబింబించడమే కాదు, రేడియో నాటికలు, గేయ కావ్యాలు, ఎబ్బులు, విమర్శ, నవలలు, నవలికలు, మహాకావ్యాలు రాసిన సంపూర్ణ సాహితీమూర్తి విశ్వనాథ సత్యనారాయణ గారు.

ఆయన 50 ఏండ్ల కిందట రాసిన 'విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు' నవల నాడూ, నేడూ, రేపటి తరాలకు కనువిప్పు కలిగించడమే కాకుండా చాలా హాస్యంగా ఉంటుంది. ఇంగ్లీషు భాషలోని లోపాలను ఎత్తిచూపుతూ, తెలుగు భాష ఎంత పరిపూర్ణమైన భాషో ఈ నవలలో చాలా చక్కగా హాస్యం పండిస్తూ రాశారు.

అయితే మారుతున్న విలువల సమాజంలో విశ్వనాథ ఛాందసుడు. ఆయన కవిత్వం తిరోగమన కవిత్వమే కానీ, అభ్యుదయం కాదనే వాదనలు చాలా ఉన్నాయి. ఆయనలోని జాతీయతా దృక్పథాన్ని అపార్థం చేసుకొని ఆధునికతకు, విజ్ఞానానికీ వ్యతిరేకి అన్నారు. భారతదేశంలో ఏమీ లేదు, చెత్తే అంటున్న రోజుల్లో భారతదేశంలో ఏముందో తన సాహిత్యం ద్వారా నిరూపించి చూపించారు విశ్వనాథ. మా నాన్నగారు మహాకాళి వేంకటరావు విశ్వనాథ వారి శిష్యులు. ఆయన కవిత్వం అంటే నాన్నకు చాలా ప్రాణం. ఆయన గురించి మా నాన్న రాసిన పద్యాల్లో ఒకటి కింద ఉదహరిస్తాను.

**చ. కవియననీవెగా, కవుల కాంతి కిరీటి**
**స్వరాట్టువీవె,**
**మా నవతర కావ్యదీధిపతికి నాట్యతపంచిన**
**కావ్యభాస్కరా**
**కవనము ఆత్మద్రష్టము, ప్రకాశము**
**పెంచు నటించు,**
**భారతీ రవమును నీదు కావ్యముల**
**రంజింపజేసితి విశ్వనాథరో!'**



అని తన గురువు విశ్వనాథ పాండిత్యాన్ని కీర్తిస్తూ రాశారు. విశ్వనాథ గారికి కూడా తన శిష్యుడైన వేంకటరావు అంటే చాలా అభిమానం. మా తాతగారు మహాకాళి వేంకటేశ్వరరావు, విశ్వనాథ వారు చెళ్లపిళ్ల వారి శిష్యులు. తాత గారు కూడా మంచి పండితులు.

విశ్వనాథ రామాయణ కల్పవృక్షంలోని పద్యాలను కొన్నింటిని మాకు అర్థం చెప్పి కంఠస్థం చేయించారు. ఒకరోజు విశ్వనాథ సత్యనారాయణ గారు మా ఇంటికి వచ్చారు. మా తాతగారు కీ.శే.మహాకాళి వేంకటేశ్వరరావును కౌగిలించుకొని చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకొన్నారు. వారికి ఏర్పరిచిన ఉచితాసనం మీద కూర్చున్నాక, నాన్నగారు మా అక్కాచెల్లెళ్లు నలుగురిని, మా తమ్ముళ్లను, అమ్మనీ, నానమ్మనీ పరిచయం చేశారు. మేము వారి ముందు చేతులు కట్టుకొని రామాయణ కల్పవృక్షంలోని ఆంజనేయుడి స్తుతి మంగళ రూప అయ్య, హరి మర్కట పద్యం, ఆంజనేయుడు సీతను చూచి వచ్చినప్పుడు రాముడితో, కాంచితి సీత పద్యంతో పాటు ఇంకా కొన్ని పద్యాలు వినిపించాం. వారు చాలా సంతోషపడ్డారు.

అప్పుడు విశ్వనాథ గారు తను రాసిన ఈ రామాయణ కల్పవృక్షం గురించి చెప్తూ.. 'ఈ రామాయణ కల్పవృక్షం, తెలుగు రామాయణం. ఒక తెలుగు కుటుంబంలో జరిగిన కథలాగా రాశాను. నేను రాసింది, ముమ్ముందు జనాలకు అర్థమవుతుందో కాదో, నేను బతికి ఉండగానే నా చేత చెప్పించుకోండి' అంటూ గాద్గదిక స్వరంతో చెప్పారు. మా కండ్లకు నీళ్లు వచ్చాయి. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు మా ఇంటికి రావడం, వారి ముందు మేము పద్యాలు చదవడం, వారి ఆశీర్వచనం తీసుకోవడం నా జీవితంలో మరిచిపోలేని మధురానుభూతి.

విశ్వనాథ వారికి జ్ఞానపీఠ అవార్డు వచ్చినప్పుడు విలేకరులు 'అవార్డు రావడం పట్ల మీ స్పందన ఏమి టి?' అనడిగితే 'అవార్డు ఇవ్వడం కంటే మిరపకాయ ధరలు తగ్గిస్తే ఎక్కువ సంతోషపడేవాడిని' అన్నారట. అప్పట్లో మిరప ధరలు విపరీతంగా పెరిగిపోయాయ ట. అంత నిక్కచ్చిగా, నిర్మొహమాటంగా మాట్లాడేవా రు. అంటే అవార్డు వచ్చినా రాకపోయినా, నిరామయునిగా ఉండే తత్వం.

నాకు గుర్తున్నంతవరకూ, వారికి జ్ఞానపీఠ పురస్కారానికి లక్ష రూపాయల నగదు బహూకరించారు. దరిద్రంలో ఉన్నప్పుడు డబ్బు రాలేదు, డబ్బు అవసరం అంతగా లేనప్పుడు డబ్బు వచ్చిందని అన్నారుట. ఆ లక్ష రూపాయల్లో సగం తన ఊరిలోని రామాలయ పునరుద్ధరణకు, ధానధర్మాలకు కొంత, రుణ విముక్తి కోసం కొంత వెచ్చించారనీ, ఒక్క పైసా కూడా సొంతానికి వాడుకోలేదట.

విశ్వనాథ విరచిత వేయి పడగలులో ధర్మారావు పాత్ర నేటికీ నిత్య నూతనం. ఈ నవలను 'సహస్రఫణ్' పేర మాజీ భారత ప్రధాని, పీవీ నరసింహారావు గారు హిందీలోకి అనువదించారు. ఆయన అనువదిస్తూ 'శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారికి ప్రాచీన సంస్కృతి మీద గల శ్రద్ధ అంతా ఇంతా కాదు. వారు సంప్రదాయబద్ధులైన పిడివాదులు కారు. స్వధర్మ రక్షణకు అవి ఉద్దేశింపబడ్డాయి. సహస్రఫణ్‌లో అనేక చోట్ల ఈ విషయం గోచరిస్తుంది. విశ్వనాథ సాహిత్యమంతా చైతన్యానికి తిరుగులేని విజయ పతాకాలు' అంటూ ప్రస్తుతించారు. ఈ నవలలో విశ్వనాథ సత్యనారాయణ గారు హిందువుల వివాహం, కుటుంబ వ్యవస్థ, ప్రకృతి ఆరాధన, మొదలైన వాటిమీద జరుగుతున్న పరిణామాల్లో వస్తున్న విలువల సంక్షోభం గురించి, గ్రామీణ జీవితంలోని మానవ సంబంధాలను, వివిధ వాదాల మీద తన ప్రతిస్పందననూ మహనీయంగా చిత్రించారు.

విశ్వనాథ వారి సంప్రదాయం ఎంత ప్రాచీనంగా కనపడుతుందో, అంత ఆధునికంగానూ కనపడుతుంది. ఇంగ్లీషు సాహిత్యంలో ఆధునిక వైతాళికుడైన టి.యస్.ఎలియట్, భారతీయ ఉపనిషత్తులను ప్రపంచశాంతి సూక్తంగా అంగీకరించాడు. అందుకే విశ్వనాథ వారిని తెలుగు ఎలియట్ అనీ, ఎలియట్‌ను ఇంగ్లీషు విశ్వనాథ అని అంటారు.

> విశ్వనాథ గారు తను రాసిన ఈ రామాయణ కల్పవృక్షం గురించి చెప్తూ.. 'ఈ రామాయణ కల్పవృక్షం, తెలుగు రామాయణం. ఒక తెలుగు కుటుంబంలో జరిగిన కథలాగా రాశాను. నేను రాసింది, ముమ్ముందు జనాలకు అర్థమవుతుందో కాదో, నేను బతికి ఉండగానే నా చేత చెప్పించుకోండి' అంటూ గాద్గదిక స్వరంతో చెప్పారు.



కేతవరపు రాజ్యశ్రీ
85001 21990



## మూడు కాలాల ముచ్చట

ఎండాకాలమనగానే
నాకు
మా నాయిన గుర్తొస్తాడు
తాటి చెట్టును నిచ్చెనగా చేసుకుని
ఆకాశంలోని అమృతభాండాల్ని
నేలకు దించి
ఊరందరి వేసవి దాహాన్ని తీర్చిన
మా నాయిన గుర్తొస్తాడు

చలికాలమనగానే
నాకు
మా అమ్మ గుర్తొస్తుంది
ఊర్లోని వరి పొలాలన్నిటా
కలుపు మొక్కల్ని పీకేసి
ఊరందరి ఆకలికి
రైతందించే అన్నం ముద్దలో
తానూ ఒక మెతుకైన
మా అమ్మ గుర్తొస్తుంది

వర్షాకాలమనగానే
నాకు
మా అమ్మా నాన్నలిద్దరు గుర్తొస్తారు
కురిపించిన చెమట వర్షంలో
తడిసి ముద్దయి మొలకెత్తి
ఏపుగా పెరిగి పెద్దయి
పచ్చబడిన పంట చేనులాంటి
ఇవాళటి
నా బతుకు గుర్తొస్తుంది



చిత్తలూరి
91338 32246



## గెలిచి తీరుతావ్

గెలుస్తావు నువ్వు
గెలిచి తీరుతావ్
కమ్ముకున్న పొగమేఘాలు
నీ చైతన్యపు సూర్యకిరణాల
ముందు దూదిపింజలై పోతాయ్
నిన్ను కమ్మేసిన నిందల నివురు
నీ సౌహార్దపు పిల్ల గాలి వల్ల
గాలిలో కలిసిపోతుంది

ముళ్ల కంచె వీరుల
దారిలో కొత్తది కాదు
బందిఖానా ఉద్యమం
పిడికిలికి సవాలు కానే కాదు
ఎవరు విసిరిన ఉండేల రాయి
వాళ్ల వైపే వెళ్లే ఒకానొక వాయు శక్తి
ఎదురుచూపు ఉండనే ఉంటుంది

దిగులు లేదు
అలుపు లేదు
మనం ఉన్నది ఎడారి భూమిని
లలిత వనం చేయడానికి
ఇంకా తెగిపోని ప్రాణ
దీపానికి చమురు కావడానికి
కత్తులు దులపరించే
చిలకలుంటాయ్

ఆకాశాలను శాసించే
మౌనజలధులుంటాయ్
అడుగులకు ముడి
పడిపోయిన ఆకాశాలు
తెగిన తీగలను మళ్లీ అతికించే
చేతి వేళ్ల కోసం చూస్తున్న పాటలు
ఉద్యమం పొడుపును తిలకంగా
ధరించిన ఉత్సాహపు జీవితాలు
ఇట్లా ఎన్ని చూడలేదు?
జనపు గుండెల భేరీల మీద
యుద్ధ నినాదం చేయలేదు?
ఎప్పుడైనా ఇరిగిపోని
ధైర్యానిదే అంతిమ విజయం
ఎగరగలిగే పక్షి
రెక్కలదే ఆవలి తీరం.



కాంచనపల్లి గోవర్ధన్ రాజు
96760 96614

జీవితాలను కథలుగా వ్యాఖ్యానించడమంటే మరుగునపడిన మానవ సంబంధాల ఎతలను దృశ్యీకరించడమే. నిజ జీవితంలో కనబడని కోణాలను, మనసు తడిని, ప్రేమ పదనును అక్షరాల్లో, అంతరాత్మను కథల్లో ఆవిష్కరించడమే కథనం. నిబద్ధతతో, నిజాయితీగా మానవీయతను నిలుపడమే కథల అంతిమ లక్ష్యం. బంధాలను అక్షరీకరించడం ద్వారా సంఘటనలకు జీవం పోసే అక్షర శిల్పి, కథకులు కొట్టం రామకృష్ణారెడ్డి. ఆయన కథలు జీవితాల్లోని అడుగంటిన ప్రేమను పాతాళగరిగెతో దేవి గిడసబారిన మనసుపై కుంభవృష్టిగా ఆర్ద్రతలను కురిపిస్తాయి.

# బాధ్యతలకు బాట

మమతలను బాధ్యతగా హృదయంలోకి ఒంపి అనుబంధాలను తిరిగి అంకురింపజేస్తాయి. కథల్లోని పాత్రలు నిజ జీవితంలో నిగ్గదీసి, నిలదీసి అడుగుతున్నట్టు కనిపిస్తాయి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2022 ఏడాదికిగాను ప్రకటించిన ఉత్తమ కథానిక పురస్కారానికి 'నూనె సుక్క' ఎంపికవడం విశేషం.

**ఆధునిక జీవితంలో నూతన దంపతుల మధ్య అగాథం సృష్టిస్తున్న అనుమానం పెనుభూతమై పచ్చని సంసారంలో దాంపత్య జీవితానికి మంట పెడుతున్న సంఘటనలు అనేకం కనిపిస్తుంటాయి. మనసెరిగి మసలుకుంటే జీవితం ఎలా మారుతుందో నిరక్షరాస్యుల విచక్షణాత్మక నిర్ణయాన్ని ఆదర్శంగా చూపుతూ రాసిన కథ 'అద్దం వెనుక'.**

అర్థం వేరు, అంతరార్థం వేరు. వాస్తవాన్ని గుర్తించకపోతే అపార్థమే జనిస్తుంది. ప్రాణానికి ప్రాణంగా ఉన్న తల్లికొడుకుల మధ్య ఒకరి మొఖం ఒకరు చూడకుండా, ప్రేమ లేకుండా చేసిన 'నూనె సుక్క' తల్లి కొడుకులను ఎందుకు విడదీసింది? కనపడని శూన్యాన్ని ఎలా నింపిందో తెలుసుకోవాలంటే ఈ కథ చదవాల్సిందే. రచయితకు నానమ్మ చెప్పిన జీవిత తాత్త్వికత, మార్మికతలో జీవితానికి సరిపడా ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి, భవిష్యత్తును తీర్చిదిద్దడానికి ఆలోచనలో బాధపడినదెవరో 'నూనె సుక్క' కథ చదివి అపార్థాన్ని తొలగించుకోవాల్సిందే.

కథలోని పాత్రోచిత సంభాషణ, సమన్వయంతో పాటు సొగసైన వర్ణనతో రచయిత ఆకట్టుకుంటాడు. పోలికల ద్వారా కథనానికి రచయిత బలం చేకూరుస్తాడు. 'నా ఎన్నెల ఎలుగుల కన్న ఎక్వ వెలుగు యాడ్కెల్లొచ్చింది' అని సీత కండ్లని సూసి సిగ్గుపడి మబ్బు సాటుకు దాక్కున్న సంద్రుడని వ్యక్తీకరించడం ద్వారా ఆఖరికి కథలో అతిశయాన్ని అతికిస్తాడు. 'సూర్యుడు ఊరిడ్సిపెట్టి పోయిండు, పొద్దుగాల మల్లొస్తనని జెప్పి' అని 'తాతిల్' కథలో పోలుస్తాడు. 'పెండ్లి పిల్ల కడిగిన ముత్యమోలే మంచిగున్నది', 'ఎవరి బతుకు వారే బతుకాలని పెద్దగయినంక కోడి తన పిల్లలను ఎడవాపుతుంది' లాంటి పోలికలు కావల్సినన్ని ఏరుకోవచ్చు. ఇలా.. ప్రతి కథలోనూ ఒక సామాజిక దృక్పథం ఉండటం రచయిత సామాజిక బాధ్యతకు నిదర్శనం. మనుషులంతా మానవీయ సంబంధాలతో అనుబంధాలు పెనవేసుకొని జీవించాలని, లుప్తమవుతున్న విలువలను పెంపొందించాలని సందేశం ఇచ్చేవి 'నూనె సుక్క' కథలు.




ఆర్ద్రతను పిండి మనసును తడిచేసే కథలివి. ఎంచుకునే కథా వస్తువును లోతుగా పరిశీలించి, పరిశోధించి ఫలవంతంగా అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని సృష్టించడం కొట్టం రామకృష్ణారెడ్డి ప్రత్యేకత. ఆయన శిల్పంలో మట్టి కూడా మాణిక్యంగా మారుతుందనడంలో అతిశయోక్తి కాదేమో. కథకు కథకు పోలిక లేకుండా, ఊహకు అందకుండా రాసే ఆయన శైలి ఎంతో రమణీయం. ఇవి టైంపాస్ కథలు కావు, తప్పక చదువాల్సిన బతుకు గాథ లు. బాధ్యతలకు బాటలేసి అత్యుత్తమ మా'నవ' జీవితాన్ని ప్రబోధించే ఆచరణాత్మక ఎతలు.



డాక్టర్
సిద్దెంకి యాదగిరి
94412 44773

# దారిచూపిన స్వయంప్రభ

2024, ఏప్రిల్ 9న చెలిమె పేజీలో డాక్టర్ శ్రీ భాష్యం అనూరాధ గారు రాసిన 'రామాయణంలో స్త్రీ పాత్రల ఔచిత్యం' అనే వ్యాసాన్ని చదివాను. వారు రావణాసురుని రెండో భార్య ధాన్యమాలిని గురించి కూడా పేర్కొన్నారు. ఈమె అతికాయుని తల్లి. అయితే రామాయణంలో అతి ముఖ్యమైన పాత్ర స్వయంప్రభ గురించి కొంచెం కూడా ముచ్చటించలేదు. స్వయంప్రభ లేకపోతే సీతాన్వేషణ నిమిత్తం దక్షిణ దిశగా సాగిన హనుమ బృందం వింధ్య రజత పర్వతాల వద్దనే ఆగిపోయేది. ఎందుకంటే, అప్పటికే సుగ్రీవుడు పెట్టిన నెల గడువు దాటిపోయింది. వారు దాహంతో రుక్షబిలంలో ప్రవేశించారు. ఆ సొరంగంలో నుంచి వారికి బయటపడే మార్గం కనపడలేదు. అక్కడ మేరు సావర్ణి పుత్రిక స్వయంప్రభ తపస్సు చేసుకుంటున్నది. మహా తేజస్సుతో వెలిగిపోతున్నది. ఆమె హనుమ బృందం కథ విని వారికి ఆతిథ్యం ఇచ్చింది. అనంతరం స్వయంప్రభ తన తపోశక్తితో హనుమ బృందాన్ని దక్షిణ దిశలోని సాగరానికి చేర్చింది.

ఇక్కడ స్వయంప్రభ లేకపోతే హనుమ బృందం దక్షిణ దిశలోని సాగరానికి రావడానికి చాలా కాలం పట్టేది. సుగ్రీవుడు తాను పెట్టిన గడువు ముగియడంతో తను హనుమ బృందం గురించి రకరకాల ఆలోచనలు చేయవలసిన దుస్థితి దాపురించేది. దీన్ని బట్టి రామాయణంలో అతి ముఖ్యమైన, అతి చిన్న పాత్ర స్వయంప్రభదేనని తెలుస్తున్నది. స్వయంప్రభ తండ్రి మేరుసావర్ణి 11వ మనువు. పురాణాల ప్రకారం.. మనువులు మొత్తం 14 మంది. మనం ప్రస్తుతం 7వ మనువు వైవస్వత మనువు కాలంలో ఉన్నాం. వైవస్వతో మనుర్నామ... అంటూ రఘువంశ మూల పురుషుని గురించి మహాకవి కాళిదాసు రఘువంశంలో చెప్తారు. వైవస్వత మను వంశానికి చెందిన శ్రీరామచంద్రుని భార్య సీతాన్వేషణకు మేరుసావర్ణి మను పుత్రిక స్వయంప్రభ సహకరిస్తుంది.

**వైవస్వత మనువు 7వ మనువు అయితే మేరుసావర్ణి మనువు 11వ మనువు. 11వ మనువు పుత్రిక స్వయంప్రభ బుక్షబిలంలో తపస్సు చేసుకోవడమేమిటి? అంటే ఇక్కడ అనేక విజ్ఞానాత్మక విషయాలు గోచరిస్తాయి. హనుమ బృందం బుక్ష బిలంలోకి ప్రవేశించడమంటే వారు భవిష్యత్తులోకి వెళ్లిపోయారని అర్థం. అందుకే వారికి వర్తమాన మార్గం కనపడలేదు.**

భవిష్యత్తులో ఉన్న స్వయంప్రభే వారిని వర్తమానంలోకి పంపింది. మూల రామాయణంలోని సంస్కృత శ్లోకాలు చదివితే ఇక్కడ అనేక మహోన్నత విజ్ఞానాత్మక విషయాలు ఛాయామాత్రంగా గోచరిస్తాయి. భవిష్యత్తు విజ్ఞాన చంద్రికలు స్వయంప్రభ లాంటి మహిళామూర్తులు అని తెలుస్తుంది. స్వయంప్రభ అన్న పేరే తనకు తానుగా కష్టించి నిర్మించుకున్న విజ్ఞాన వెలుగు అన్న అర్థాన్ని తెలియజేస్తుంది. ఆమె గగనవాయు గణ శాస్త్రాలలో మహా నైపుణ్యం కలది.



మన వేద మంత్రాల్లో వైవస్వత మన్వంతరే... అని వస్తుంది. అంటే మనం 7వ మనువు కాలంలో ఉన్నామని అర్థం. 14 మనువులలో 7వ మనువు అంటే సగం మనువుల కాలం పూర్తయ్యిందని అర్థం. నేటి ఆధునికత భౌతిక శాస్త్రాదులు కూడా దాదాపు భూమికి సగం వయస్సు నిండిందనే చెప్తున్నాయి. మన మహర్షులు ఇలాంటి విజ్ఞానాత్మక విషయాలను స్వయంప్రభ వంటి పాత్రల ద్వారా నిక్షిప్తం చేశారు. అయితే దురదృష్టవశాత్తూ మన పురాణ పండితులు అధికశాతం ఇలాంటి విషయాలు చెప్పకుండా సీత, అనసూయ అంటూ కథలు మాత్రం చెప్తున్నారు. మన పురాణాలను సూక్ష్మంగా పరిశీలిస్తే అనసూయ ఆశువ్రీహి అనే వరి ధాన్యాన్ని కనిపెట్టినట్టు తెలుస్తుంది. ఇలాంటి విషయాల మీద పరిశోధన చేయకుండా 'మన వేద పురాణాల్లో అన్నీ ఉన్నాయి! విదేశీయులు వాటిని ఎత్తుకెళ్లిపోయారు! వాటినే మనకు చెప్తున్నారు' అని ఇప్పుడు కూడా అంటే అంతకుమించిన తెలివితక్కువతనం మరొకటి లేదు. ఒకప్పుడు ఈ మాట అంటే చెల్లింది. ఇప్పుడు కూడా అదే మాట అంటే...

**భారతీయ పురాణ పండితులు మాటలకు తప్ప ప్రయోగశాల ముఖం చూడటానికి పనికిరారు, వారి చూపులు, మాటలు ఆకాశానికి ఉంటే చేతలు పాతాళానికి ఉంటాయని అందరూ అంటారు.**

శాంత దశరథుని కూతురా? రోమపాదుని కూతురా? ఇంతకీ రామునికి సీత ఏమవుతుంది? సీతకు రాముడు ఏమవుతాడు? ఇద్దరూ మనకేమవుతారు? రాముని అయనం రామాయణమా? సీతాయాః చరితం సీతాయణమా? రావణ వధా? లంకా విజయమా? వంటి ఆలోచనలతో కాలక్షేపం చేసినంతకాలం రామాయణంలోని స్వయంప్రభ లాంటి వారి విజ్ఞానతేజం బహిర్గతం కాదు.

> మనం ప్రస్తుతం 7వ మనువు వైవస్వత మనువు కాలంలో ఉన్నాం. వైవస్వతో మనుర్నామ... అంటూ రఘువంశ మూల పురుషుని గురించి మహాకవి కాళిదాసు రఘువంశంలో చెప్తారు.



వాగుమూడి
లక్ష్మీ రాఘవరావు
98494 48947

## గుల్‌మొహర్

నిద్రొస్తే నిద్రపో
మెలకువగా ఉంటే
ఈ రాత్రి ప్రియమైన వారిని
తిరిగి తీసుకురాలేదు

నా రాబోయే పుస్తకంలో
ప్రతి పేజీలో నీ పేరు రాస్తాను
ఎవరైనా అడిగితే మాత్రం
వెంటనే నీ గురించి రాస్తాను

తాను పేదవాడిని అనుకొని
నాకు వీడుకోలు పలికాడు
ఇవ్వడానికి ఏముంది
అతడి దగ్గర ప్రేమ తప్ప

జీవితంలో ఇలాంటి చిక్కులు
వస్తాయనుకోలేదు
ఏడవడం తప్పనిసరి
కొన్ని కన్నీళ్లు దాచుకోవాలి.

హిందీ మూలం: గుల్జార్


అనువాదం: వెన్నెల సత్యం, 94400 32210




## పుస్తకావిష్కరణ

ఈ నెల 12న సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌లోని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్వగృహంలో 'చెన్నమనేని రంగనాయకమ్మ స్మారక విశిష్టాద్వైత జాతీయ సాహిత్య పురస్కారం' ప్రదానోత్సవ కార్యక్రమం జరుగనున్నది. ముఖ్య అతిథిగా వెంకయ్యనాయుడు హాజరవుతుండగా.. రేవూరి అనంత పద్మనాభరావు సభాధ్యక్షత వహించనున్నారు. శ్రీదేవి మురళీధర్‌రావు, గార రంగనాథం, వైష్ణవ వేంకటరమణమూర్తిలను ఈ కార్యక్రమంలో సత్కరిస్తారు. అనంతరం 'శ్రీభాష్యం-కరదీపిక', 'వేదాంత దేశికులు-హంస సందేశము' పుస్తకాల ఆవిష్కరణ ఉంటుంది.

**– శ్రీలేఖ సాహితీ, వరంగల్**



## కవితా సంపుటాలకు ఆహ్వానం

గీతమ్ సంస్థ పన్నెండవ వార్షికోత్సవం సందర్భంగా 'గీతమ్ పురస్కారం' కోసం కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. 2016-2024 మధ్యకాలంలోని సంపుటాల మూడు కాపీలను జూన్ ఆఖరి వరకు అధ్యక్షులు, గీతమ్ సాహితీ సంస్థ, పిఠాపురం 533450 చిరునామాకు పంపించాలి. అత్యుత్తమ సంపుటికి రూ.10,116తో పాటు జ్ఞాపిక పురస్కారం అందజేస్తారు. పూర్తి వివరాలకు 98483 98240 నంబర్‌ను సంప్రదించండి.